

సమావేశంలో పాల్గొన్న సత్యానంద భారతీ స్వామి, ఎమ్మెల్సీలు కవిత, వాణీదేవి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, టీఎస్‌ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మాజీ ఎంపీ లక్ష్మీకాంత్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, గిడుగు రుద్రరాజు, ఎన్వీఎస్సెస్ ప్రభాకర్, పురాణం సతీశ్, దేవీ ప్రసాద్, రామ్మోహన్, పీవీ ప్రభాకర్ రావు, దైవజ్ఞ శర్మ, వక్కలంక శ్రీనివాస్ తదితరులు

# కుల ధర్మ పరిరక్షణలో.. బ్రహ్మ గర్జన

బ్రాహ్మణ కుల ధర్మ పరిరక్షణకు, న్యాయపరమైన కోర్కెల సాధనకు, రాజకీయ పురోగమనానికి బ్రహ్మ గర్జన బహిరంగ సభ బ్రాహ్మణ కులోత్తముల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్ – సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం మైదానంలో జరిగింది. సభ ప్రారంభానికి ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మహిళలతో శ్రీలలిత – విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. బ్రహ్మ గర్జన చైర్మన్ వెన్నపంల్లి జగన్మోహన్‌శర్మ, వైస్ చైర్మన్ తులసి శ్రీనివాస్, కోశాధికారి ముని పల్లె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు.

– ఆర్కేపురం, జూలై 9



ఆధ్యాత్మిక శ్లోకాలను పఠిస్తున్న బ్రాహ్మణోత్తములు






ఎమ్మెల్సీ కవితకు పూలమాల వేస్తున్న సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తదితరులు



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ కులోత్తములు

# అడవిబిడ్డలకు ఆంగ్ల విద్య

- 'మన ఊరు-మన బడి'తో అత్యాధునిక సౌకర్యాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్లం ప్రపంచాన్ని శాసిస్తున్నది. పరిపూర్ణంగా ఏ సమాచారం కావాలన్న అది ఆంగ్లంలోనే సాధ్యమవుతున్నది. యావత్ ప్రపంచాన్ని ఏలుతున్న గూగుల్, అలాగే సామాజిక మాధ్యమాలు ఇలా ఏవీ చూసిన ఆంగ్లభాషలోనే లభ్యమవుతాయి. ఒక విద్యార్థి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే.. అందుకు తగిన పూర్తి సమాచారం ఆంగ్లములోనే దొరుకుతున్నది. అలాగని తెలుగు భాషను తక్కువ చేయాలన్నది ఎవరి ఉద్దేశం కాదు. కానీ, మారుతున్న కాలానికి, ప్రపంచీకరణకు, కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తర్ఫీదు కాకపోతే.. మార్కెట్‌లో ముందుకు పోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఏ కోణంలో చూసినా ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి అవుతున్నది.

'ఇది కెరమెరి మండలం సాకడ గ్రామంలోని పాఠశాల. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉంది. ఈ మారుమూల గ్రామంలో 30 ఇండ్ల వరకు ఉంటాయి. 'మన ఊరు- మన బడి' ద్వారా ప్రభుత్వం ఇందులో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. ప్రైవేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు కల్పించింది. ఎల్‌కేజీలో పది మంది పిల్లలు చేరగా, ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రారంభించింది.



సాకడలోని పాఠశాలలో కుర్చీల్లో కూర్చొని చదువుకుంటున్న ఎల్‌కేజీ విద్యార్థులు

### 215 పాఠశాలలు ఎంపిక..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 251 ప్రభుత్వ పాఠశాలలను 'మన ఊరు-మన బడి' కింద ఎంపిక చేశారు. ప్రభుత్వం రూ. 91 కోట్లు కేటాయించగా, సకల సౌకర్యాలతో అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే 10 పాఠశాలలు పూర్తికాగా, మిగతావి పురోగతిలో ఉన్నాయి. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. దాదాపు 1200 మంది ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంగ్ల బోధన ద్వారా గిరిజన విద్యార్థులకు మంచి ప్రయోజనం చేకూరుతుంది. గిరిజన విద్యలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇంతకాలం ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఆంగ్ల.. విద్య ఇప్పుడు ఆదివాసీ గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న చిన్న చిన్న పాఠశాలల్లో సైతం అందుబాటులోకి రావడం శుభపరిణామమని గిరిజనులు పేర్కొంటున్నారు.

# వైభవంగా బోనాల జాతర

మందమర్రి, జూలై 9 : మందమర్రి పట్టణంలో ఆదివారం మహంకాళీ బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బురదగూడెం సమీపంలోని అమ్మవారి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏరియాలోని కేకే-1 సీఎస్పీ కాలనీలోని సతీశ్ భవాని ఇంటి నుంచి బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. మంచిర్యాల జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి కాలనీవాసులతో కలసి బోనాలతో తరలివచ్చారు. డప్పుచప్పుళ్ల నడుమ సీఎస్పీ రోడ్డులో ప్రారంభమైన శోభాయాత్ర యాపల్, రామన్ కాలనీ, పాతబస్టాండ్ ఏరియా, బురదగూడెం మీదుగా ఆలయం వరకు సాగింది. చిన్నారులు వివిధ వేషాధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు, అమ్మ వారిని రంగురంగుల పూలతో శోభాయమానంగా అలంకరించారు. కొందరు మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.



నెత్తిన బోనంతో భక్తులతో కలిసి వస్తున్న జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

## మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

ఉట్నూర్, జూలై 9 : గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2023–24 మిగిలిన సీట్లకు ఈ నెల 10,11వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు కుమ్రం భీం ప్రాంగణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు, బాలురకు 11న ఉదయం 10 గంటలకు లాల్‌టేకిడి బాలుర జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య-జయతారదంపతులు

# ముగిసిన రాజశ్యామల యాగం

- పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య దంపతులు
- ప్రత్యేక పూజలు

బెల్లంపల్లి, జూలై 7 : ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాల సౌజన్యంతో శ్రీ వాసవీ భజన బృందం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మూ డు రోజుల శ్రీ చండి, రుద్ర, సుదర్శన, మహాలక్ష్మి సహిత శ్రీ రాజశ్యామల మహాయాగం ఆదివారంతో ముగిసింది. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య–జయతార దంపతులు హోమంలోపాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఆలయంలో స్థాపిత దేవత పూజలు, పారాయణం, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి, అవబృదస్నానం, పండిత ఆశీర్వచనం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలువేరు దయాకర్, ఎలుగూరి అంజయ్య, తణుకు సదయ్య, రేణికుంట్ల శ్రీనివాస్, సిద్ధంశెట్టి శ్రీనివాస్, భజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.